కథానిక

# యక్ష ప్రశ్నలు

తెన్నేటి అహల్యాదేవి

ప్రపంచంలో నేను భయపడేదల్లా ఒక్క విషయానికే–ప్రశ్నలకి! ఎంతగా నేను వాటిని తప్పించుకు తిరగాలనుకుంటానో అంతగా అవి నా వెంటబడి తిరుగుతూనే వుంటాయి. ఏదైనా విచిత్రం కనబడితే చాలు ప్రజలు ఇక ప్రశ్నలతో ప్రాణాలు తీసేస్తారు. ఎంత మారుమూలల్లో దాగుదామన్నా ఏకాంతం లభించదు. ఏదో ఒక కారణంగా ఎవరో ఒకరు ఎక్కడో అక్కడ ప్రశ్నలవర్షం కురిపిస్తుంటారు. అందుచేతనే నాకు ఎవరితో స్నేహం చెయ్యాలన్నా తగనిభయం; అందుకనే నాకు ఒంటరితనం అలవాటైంది.

ముచ్చటకొద్దీ ఒకసారి నేను మంచి గాజు పాత్రలో చేపల్ని పెంచాను. కొద్దికాలంలో అవి మచ్చిక అయినాయి. వాటిగంతులు, సంతోషం చూస్తే ఎంతో ముచ్చటగా వుండేది; మనస్సులో ఆందోళన సగం తగ్గేది. నీటిబుడగల్ని వెంటాడుతూ చిన్నతరంగాల్లో ఈదుతూండే ఆ చేపలు ఎంతో ఉత్సాహాన్ని కల్పించేవి నాకు.

ఇంకేముంది? ఈ వార్త ఇరుగు పొరుగులికి చేరనే చేరింది. ప్రపంచ చిత్రాల్లో ఇదీ ఒకటైంది వాళ్ళకి. ఇక వచ్చేపోయేవాళ్ళ ప్రశ్నలకి సమాధానం చెప్పీచెప్పీ నాగొంతు చెడిపోయింది. ఒక రోజేమైందనుకున్నారు? ఎన్నడూ ముక్కూ మొహం ఎరగనివాళ్లు నలుగురు లోపలికి పడతోసుకొచ్చారు. అందులో ఒకడు రావటమే పాత్ర దగ్గిరికిపోయి, గుడ్లుపెద్దవిచేసి 'భలే తమాషాగా చేశారే! అంతా గమ్మత్తుగా వుంది. మరి ఒకచేపని పట్టుకోవచ్చా' అన్నాడు. రెండోవాడు 'జాగ్రత! పట్టుకున్నారంటేనా? అమాంతంగా చచ్చి వూరుకుంటాయి' అని అరిచాడు. మూడో ఆయన 'అసలు నీకు ముట్టుకునే అవసరమేముంది? దూరాన్నించి చూస్తే చాల్దూ' అని మందలించాడు. ఇంతవరదాకా చేపలవంకే చూస్తూవున్న నాలుగో పెద్దమనిషి తెలివిలోకివచ్చి 'దేవుడి దయుంటే నేనూ పెంచుకోవాలి ఇలాటి చేపల్ని' అన్నాడు.

రెండో ఆయన 'అసలిల్లాంటి చేపలు నీకు దొరకాలిగదా' మొదటి ఆయన: "ఎవరికి వా అయినపని వాళ్ళనే చెయ్యనియ్యరా! మధ్య మ కెందుకీవృత్తి.' బహుశః మా తాత ముత్తాత కాణ్ణించీ మాకిదేవృత్తి అయినట్లు ధ్వనించాడు పెద్దమనిషి.

నాలుగోవ్యక్తి 'ఏమైనాసరే ఇలాటి పాత్ర నేను వెళ్ళేప్పుడు కొనుక్కుపోతా.'

మూడో—'దారిలో అదికాస్తా పగిలిపోతు దనుకో! అప్పుడు?'

ఇల్లా వాళ్ళు వచ్చిన పని ధోరణి విడిచిపె రెట్టించి తర్కించుకొంటుంటే, కుక్కిన పేనుల కూర్చున్నా ఏమనాలో తోచక. ఇక ఉండబ లేక 'తమరెవరు? అసలిక్కడికి దేనికి దయచేశారు' అని.అడిగేశాను.

అప్పటికి ప్రపంచంలో పడ్డారువాళ్లు! 'ఆ! అ క్షమించాలి. ఎస్. వి. ఎస్. హాల్లో ఇవాళ...క సమ్మేళనం ఉంది' అన్నారు.

"అయితే నన్నేం జెయ్యమంటారు?" సూటిగ అడిగాను. వాళ్లు నలుగురూ ఒక్కసారేనవి "అలా అంటే ఎలా? ఈ సమావేశంలో వి చాతుర్యమంతా చూపాలి. మిమ్మల్నాహ్వానిం టానిక్కాదూ మేం వచ్చింది? మీరు తప్ప రావాలి" అన్నారు.

"అల్లాగే చూద్దాం" అన్నా. వ్యవధి తక్కువై పోయింది మరీ.

"అబ్బ! చూద్దామేమిటి? రాకపోతే బలవ తాన పట్టుకుపోగలం" అన్నారు ప్రబుద్ధుల చేపలపాత్రవంక తిరిగి తిరిగి చూస్తూ పోతూ.

ఆ పాత్రని అలాగే మేజామీదవుంచి నే రాసుకుంటూకూర్చున్నాను. చీమ చిటుక్కుమంటే

మనసు చెదిరిపోయే సమయమది! గాడిద ఓంద్రం గాంటి కంఠస్వరం విని దద్దరిల్లాను.

"అహాహాహా! ఏంచెప్పాలి ఏంచెప్పాలి? భలే బాగుందిలెండి...ఏమండిబాబూ.. ఏమిటిది!"

అతని అరుపునకు నాకు ఒళ్లు జల్దరించింది. తలెత్తి చూచాను. ఎరిగినముఖం అయితే కాదు. ఆ వ్యక్తి చేపలపాత్రనుచూసి "ఏమండి బాబూ! నమ్మలేన్నే!...అసలిది ఏమిటంటారు...నమస్కారం" అన్నాడు. ప్రతినమస్కారం చెప్పి తలవంచుకు రాసుకుంటున్నా అతని ధోరణి పసిగట్టి.

"ఆ! చేపలే...బతికే ఉన్నాయండోయ్! మాశారోలేదో ఈదుతున్నాయి" అని పకపక నవ్వాడు. పాత్రపైన చిటికె వేశాడు. "అయ్యో అన్నీ కిందికి పోయాయి"అని పెడబొబ్బపెట్టాడు. అంతతో ఆగితే బాగుండును!

"ఏమండీ! వీటిసెక్కడ కొన్నారు? ఇవ్వీ ఏం తింటాయంటారు?" అని ప్రారంభించాడు.

"డబుల్ రొట్టె చూర" అన్నాను.

"మరి మాంసం తినవా?"

"బహుశః అదిగూడా తింటాయనుకుంటా."

"బహుశః ఏమిటండోయ్? భలేవారు! అసలు వాటి ఆహారమే మాంసం. లేకపోతే నదిలో మాకుమల్లే వీటికి డబుల్ రొట్టెల చూర్ణం తినిపించే వెవరు?

"అంతే అనుకోండి."

"అనుకోవట మంటారేమిటి మళ్ళీ! అది అంతే. ఏటిసెప్పుణ్ణా మాంసం తినిపించి చూడక పోయారూ!"

"ఎప్పుడూ ఆ అవసరం కలిగింది కాదు"అన్నా రాసుకుంటూనే.

"బాగా చిన్న చిన్న ముక్కలు చేసి గనక వేస్తిరా మా చక్కగా తింటాయి. మీకు పుణ్య ముంటుంది మరీ పెద్దముక్కలు పడేసేరు! అల్లా అయితే అసలు తినలేవు...మర్చిపోయా ఇవి మీ దగ్గర ఎంతకాలంనుంచీ వున్నాయి!"

"నెలలు గడిచాయి."

"అరె! చచ్చిపోలేదా?"

"కొన్ని చచ్చిపోయాయి."

"అయ్యో పాపం! ఎలా చచ్చిపోయాయండీ?"

"ఏంలేదు, కొంచెం అజాగ్రత్తవల్ల."

"ఏందుకంత అజాగ్రత్త చేశారు?"

"ఏదో అలా అయింది."

"ఎందుకైందీ అని గాదండీ అడిగేదీ. మీ అజాగ్రత్తవల్ల వాటిప్రాణానికి మూడింది. ఇవ్వి బాగా అలవాటు పడ్డాయి కాదూ. ఇవ్వి ఇహ చావవులెండి. అంతేనా! ఇవ్వికూడా చచ్చిపోతా యంటారా? అన్నట్టు రోజూ నీళ్లు మారుస్తారా?"

"మారుస్తాను."

"రోజుకెన్నిసార్లు మారుస్తారు?"

"ఏదో ఒకటిరెండుసార్లు."

"ఒకవేళ-మాటవరసకి—రెండు మూడు రోజులు మార్చకపోతే?"

"నీళ్ళు మురికి అవుతాయి."

"ఓహో! అదా! ముఱుగులాతే చేపలు చచ్చి పోతా యనుకుంటా! అంతేనాండీ!"

నాకు సహనశక్తి సాంతం చచ్చింది. 'స్వామీ నన్ను క్షమించండి. నేను రాసుకుంటున్నాను. మీ ప్రశ్నల్తో నా మనస్సు పట్టుదప్పుతోంది. దయ వుంచి నన్ను రాసుకోనివ్వండి' అన్నాను.

"ఇది మరీబాగుందండోయ్! మీరాతకి ఎవరడ్డ మొచ్చారు? నిక్షేపంలా రాసుకోండి!...అయితేనూ ఇవి పిల్లల్ని పెడతాయూ?"

"పెట్టవుస్వామీ పెట్టవు."

"నిజమేనండోయ్. ఇవి పెట్టేవి గుడ్లుకాదూ! దీంట్లో జాగా తక్కువగావుందే. ఈ చేపలొచ్చేది ఆ గుడ్లల్లోనించేగా? తెలియకడుగుతాను మీరు నీళ్ళుమార్చినప్పుడు ఆ గుడ్లు ఏమౌతాయి?"

ఇక నా ప్రాణం విసిగిపోయింది. ఎంతసేపని ఈ ప్రశ్నలూ సమాధానాలూ. మొహంచిట్లించి మాట్లాడకుండా రాసుకోవటం ప్రారంభించాను.

ఆయన వెళ్ళాడనుకుంటే ఆయన వెనకాలే మరోపుణ్యాత్ముడు ప్రవేశించాడు.

"ఇవేమిటండీ?...చేపలుకాదూ? భలే రంగు రంగుల చేపలు! బతికేవున్నాయా? వీటినిక్కడ తెచ్చారేం? పెరిగి పెద్దవైతే వీటిసేంచేస్తారేం" అని ప్రశ్నిస్తూ.

ప్రతిరోజూ ఇదేవరస! రాత్రింబగళ్లు ఈ రభసే, చదువున్న వాళ్ళకూడా ఇంగితజ్ఞానం నశించింది ఈ విషయంలో. ఎంతపనిలో వున్నాసరే. ఈఅర్థం లేని ప్రశ్నలికి సమాధానం చెప్పంది నిష్కృతిలేదు.

ఈ బెడద ఎలాగైనా వదులుతుందేమో అని చేపల పాత్రని లోపల దాచేశాను. మర్రోజున- ఒక పెద్దమనిషి వస్తూనే "ఏమండీ! ఆ చేపలేమైనయ్! కనిపించవేం? కొంపతీసి చచ్చిపోలేదుగదా" అని అడిగాడు.

"మీదయ ఇంకా మామీద వుండగానే అవి ఎలా చస్తాయిలెండి బతికేవున్నాయి" అన్నా.

"మరేవీ! కనపడవేం?"

"లోకులప్రశ్నలికి తట్టుకోలేక లోపలపెట్టాను"

ఆ పెద్దమనిషికి పీసమంత సంస్కారంకూడా వున్నట్టులేదు... "భలేవాళ్ళు లెండి! అంతదాచుకో వాల్సిన అవసరమేమిటండీ? ఎక్కడున్నాయో చెప్పండి. మీకు బద్ధకమైతే నేనైనా తెచ్చి బల్ల మీద పెడతాను" అన్నాడు.

ప్రబుద్ధుడు తెస్తూ ఎక్కడ పగలేస్తాడోనని అమితభయంతో—"లేదులెండి మీకెందుకాశ్రమ! తమరు ఆసనం అలంకరించండి. నేనే తెచ్చిపడే స్తాను" అన్నాను. ఆ పెద్దమనిషి 'నాకు చేతులు రెండున్నాయి భగవంతుడిచ్చినవి' అన్నాడు లోపలికి పోబోతూ.

"వద్దువద్దు. మీరు జారవిడుస్తారేమో" అన్నా వణుకుతూ.

"నే నెందుకు జారవిడుస్తాను?"

ఇహ ఈపీడ ఎలాగూ తప్పదు. తెచ్చి చేపల పాత్రని బల్లమీద పెట్టాను. ఆయన వాటిని చూస్తూ, తనలో తనే మాట్లాడుతూ నవ్వుతూ నానాగోల చేస్తున్నాడు. ఎల్లాగో అతన్నివదిలించు కుని, |అసంపూర్తిగా రాసినకాగితాలని అలానే వుంచి, ఆయాసంగా వుంటే నిద్రబోయాను.

* * *

ఒకనాటి మిట్టమధ్యాహ్నం రెండు ఝాముల వేళ మంచినిద్రలోవున్నాను. శరీరంమీద స్పృహ లేదు. ఎవరో పిలుస్తున్నట్లనిపించింది. అతి కష్టం మీద కళ్లువిప్పిచూశాను. ఎవరో పెద్దమనిషి టోపీ చేత్తోపట్టుకుని నమస్కారం చేస్తూవచ్చి—

"ఏమండిసార్! ...ఆ చేప లేమైపోయాయి" అన్నాడు.

ఎంత ఘనకార్యమండి సుఖమైననిద్ర పాడు చేశాడు! ఎల్లాగో ఓర్పు తెచ్చుకుని "చాలా అలిసి పోయి వున్నాను. మరోసారి దయచేద్దురుగాని ప్రస్తుతానికి సెలవు" అన్నాను గుచ్చుకపోయ్ కళ్లు ఎల్లాగో తెరిచివుంచి. అతను వెటకారంగా నవ్వాడు. "ఏం మీ వంట్లోబాగుంటల్లేదనుకుంటా! నిన్న మధ్యాహ్నం మిమ్మల్ని రోడ్డుమీద చూశాను. బాగానేవున్నారు. అయినా దిగులు పడకండి, అదే తగ్గిపోతుంది"అంటూ నా మంచం మీద చతికిలబడ్డాడు. మంచమంతా అదిరిపడింది అతని స్థూలకాయంతావుకి! నా ఆరోగ్యాన్ని గురించి ఒకవంద ప్రశ్నలు వేశాడు. ముఖం తప్పు కుంటూ అన్నిటికీ చచ్చీచెడీ జవాబులు చెప్తున్నా గూడా తరిచి తరిచి ప్రశ్నిస్తూనే వున్నాడు. కొంత సేపయాక—

"క్షమించండి సార్! మీకు చాలాకష్టం కలిగించాను. మా స్నేహితుడొకనికి మీ చేపలు చూపిస్తానని మాటఇచ్చి తీసుకొచ్చాను. ఆయన వాకిట్లో నిలబడివున్నారు. పిలుచుకురమ్మంటారా. మిమ్మల్ని కలుసుకోవాలని గూడా అతను మరీ మరీ ఇదౌతున్నాడు" అని నా సమాధానానికి ఎదురుచూడ కుండానే గొంతు పెద్దచేసి 'లోపలికి రావోయ్! బాబుగారు నిద్రలేస్తున్నారులే' అని కేకేశాడు.

వాకిట్లో పొంచునివున్న 'మహాత్ముడు బూట్లు విపరీతంగా చప్పుడు చేసుకుంటూ రానేవచ్చాడు. ఇంక తప్పేదెలా? సగంమూసుకుపోయిన కళ్ళతో, కాళ్ళీడ్చుకుంటూ పోయి ఆ పాత్రని తెచ్చాను. నాకు సహాయంకోసమన్నట్టు వాళ్ళిద్దరూ దాన్ని నా చేతుల్లోంచి లాక్కోటం ప్రారంభించారు. ఎలాగైతేనేం వాళ్ళ బారినుంచి తప్పించుకుని ఆ పాత్రని మేజామీద ఉంచాను. ఇహనేనక్కర్లేదు వాళ్ళకి. ఆ పాత్రమీద విరుచుకుపడి గదిపెంకు లెగిరేటట్లు గావుకేకలు, కేరింతాలూ! కొంత సేపటికి నా వైపు తిరిగారు.

"ఇవెక్కణ్ణించి తెప్పించారండీ! ఎన్నిరోజు లైంది తెప్పించి? ఏమితింటా యివ్వి? ఎప్పుడైనా గుడ్లుపెట్టగా మీరు చూశారా?—వీటిరంగు సహజ మైందేనా?" అంబుల పొదిలోంచి బాణాలు ఒక్కటొక్కటిగా తీసివేసినట్లు ప్రశ్నలు విసుర

న్నారు ఇద్దరూ. పక్కమీద పొర్లాడుతున్నా సరే తరిచి తరిచి కురిపిస్తున్నారు ప్రశ్నలు.

*  *  *

ఈ చేపల మూలాన రెండు సంవత్సరాలుగా నాకీబాధ తప్పిందిగాదు. ఆ ప్రశ్నలకి ఒక తాడూ బొంగరం అంటూవున్నా బాగుండును. 'వీటిని పెద్దతొట్టిలో ఎందుకు వెయ్యలేదు? కొంచెం మట్టి గూడా దీన్లో వెయ్యక పోయినారా? పెద్దయింతర్వాత ఇవి ఏమౌతాయి' ఇల్లాంటివే అన్నీను.

ఒక వ్యవహారం గురించి నేను గ్రామాంతరం వెళ్ళవలసి వచ్చిందొకసారి. చేపల్ని మా స్నేహితుడికి అప్పగించి వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి అవన్నీ సరియైన పోషణలేక కావచ్చు చనిపోయాయి. చేపలైతే చచ్చిపోయినాయి గాని ప్రశ్నలు మాత్రం అక్షయంగానే వున్నాయి. నేను చస్తేగాని ఈ ప్రశ్నలు చావవేమో! ప్రతివాడూ పోయే వాణ్ణిపట్టుకొని ఆపటం; అక్కడనుంచీ,—

"పాపం, చచ్చిపోయాయట గాదుటండీ మీ చేపలు! ఎంత మాంఛి చేపలండి వాటి దుంపతెగా! అసలు అట్లా ఎట్లా చచ్చిపోయాయో! ఎవరి దగ్గర మీరు వాటిని వదిలిపెట్టింది? అయ్యన్నేం పోయింది వాటిని సరిగ్గా చూసివుండడు, మాలాటి వాళ్ళకప్పగించి పోయినా నిక్షేపంలా కాపాడే వాళ్ళం. బహుశః నేననుకుంటానూ, ఆయనెవరో నీళ్ళుమార్చి వుండడు. అసలే తింటానికి ఏమైనా వేశేవాడో అదీలేదో' అంటూ సానుభూతి ప్రకటించటం.

ఇంతకాలం తర్వాత ఇప్పుడు ఎవరైనా ఆ సంగతి ఎత్తి ప్రశ్నిస్తారేమోనని హడలు పుట్టు వుంటుందంటే నమ్మండి!

(ఉర్దూ మాతృక ఆధారంగా)

---

స్కెచ్

# కొత్తా—పాతా

"పారిజాత"

గ్రామ కచేరీ దగ్గర జనం గుమిగూడి వున్నారు. కచేరీ సావడిలో గ్రామమునసబు శరభయ్య రెవెన్యూ ఇనస్పెక్టరుతో మంతనాలు జరుపుతున్నాడు. కరణాలు నల్గురూ బయట నిలబడ్డారు. బయటనున్న రైతులు మాత్రం గ్రూపులుగా విడిపోయి వారివారి సాధక బాధకాలను గూర్చి, అనుభవాలను గురించీ చర్చించుకొంటున్నారు.

ఇంతలోనే ఇనస్పెక్టరుగారు టకటక బూట్లు నేలను తన్నుకుంటూ వచ్చి తన ర్యాలీ సైకిలుపై ఆసీనులవుతూ మునసబు, కరణాలవద్ద వందనాలు స్వీకరించి రైతులకేసి మార్వెలస్‌గా పోజు విసిరేడు. రైతులలోకి మోతుబరులిర్వురు ఎదురుగా వచ్చి నమస్కారాలు అందచేశారు. అవి స్వీకరిస్తూ "మీ మునసబుగారితో అంతా మాట్లాడాను. రేపు మంగళవారం మీలో నల్గురు మునసబుగారితో కలిసి మా ఆఫీసుకురండి. ఆపైదంతా నేనీలోగానే పూర్తిచేసి వుంచుతా" అంటూ వెళ్ళిపోయాడు.

మోతుబర్లు మునసబుగారి కేసిచూడగానే శరభయ్య గెజిటెడ్ ఆఫీసరు మామగారిలా పోజుపెట్టి లోనికి తప్పుకున్నాడు.

అసలీ మోతుబర్లందరికీ శరభయ్య అంటే నమ్మకం లేదు. వెనక టరన్ దాళ్వా లేనివారికి అడిషనల్ దాళ్వాపంట తెప్పిస్తానని ఎకరాకు పది రూపాయల వంతుని వసూలుచేసి ఆర్డర్లు వచ్చేసినవని తూర్పు లంకలవైపు వారి నందర్నీ నమ్మించాడు. వారందరూ నిజమేననుకొని దమ్ములు చేసుకొని నారునాటుకొన్నారు. చేను మూలతిరిగింది. రైతులు శరభయ్యని స్తుతించారు. నెల